క్లుప్తంగా

కానూరులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



పెనమలూరు: కానూరులో శుక్రవారం పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు 3వ సచివాలయం పరిధిలో విస్తృతంగా పర్యటించి చర్యలు చేపట్టారు. బందరురోడ్డు, పంటకాలువ రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలు తీయించారు. ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని పరిశీలించారు. డ్రైనేజీలలో మురుగు తీయించారు. తాడిగడప పరిధిలో వసంతనగర్, బందరు కాలువ చిన్న వంతెన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేయించారు. బడ్డీ కొట్లు, తోపుడు బళ్లు రోడ్లు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటానని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషిచేయాలి

విజయవాడరూరల్: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఏపీఎస్ఐఆర్‌డీపీ జేడీ కేఎస్ వరప్రసాద్ అన్నారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెండవ రోజు గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైన సర్పంచులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆయన ఎంపీడీఓకు సూచించారు. డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్‌వీఎస్ మూర్తి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు, తాగునీరు సరఫరా, మౌలిక సదుపాయాలను కల్పించడంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తూ మంచి పరిపాలన అందించడానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ బీఎల్వీ శేష గిరిరావు, హౌసింగ్ ఏఈ, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ శిక్షణతో నైపుణ్యాభివృద్ధి

ఉయ్యూరు: ఉత్తమ శిక్షణతో నైపుణ్యాభివృద్ధి సాధించవచ్చని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈఓ గణేష్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని నాక్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటుచేసిన స్కిల్ హబ్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్కిల్ హబ్‌లో అందిస్తున్న కోర్సుల వివరాలు తెలుసుకుని, శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ముఖాముఖి నిర్వహించారు. యువతకు ఉత్తమ శిక్షణ ఇచ్చి నైపుణ్య వృద్ధి చేయాలని, ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ గౌరీమణి పాల్గొన్నారు.

కార్మికవర్గానికి సంక్షేమ ఫలాలు అందించాలి

ఉయ్యూరు: కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉయ్యూరు టాక్సీ స్టాండు సెంటరు వద్ద శుక్రవారం కార్మిక, కర్షక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకుడు అన్నే సుబ్బారావు మాట్లాడుతూ రైతులు పండిస్తున్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులు అందరికీ సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించాలన్నారు. మున్సిపాలిటీలో ఉపాధి పథకం ద్వారా కూలీలకు ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పడాల లక్ష్మణరావు, బి.రాజేష్, బి.కీర్తి, తిరుపతయ్య, రమేష్, షరీఫ్, కేసీపీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

శివాలయంలో షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

కంకిపాడు: అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా కోరారు. ఈడుపుగల్లు గ్రామంలో ఉన్న శివాలయంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. దాతలు వెలగపూడి ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి వితరణతో రూ.13 లక్షల అంచనా వ్యయంతో షెడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దేవినేని రాజా మాట్లాడుతూ ఆలయంలో సమకూరుతున్న వసతులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ఉయ్యూరు: పట్టణంలోని ది న్యూ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న కొలుసు వంశీకృష్ణ (30) అదృశ్యమయ్యాడు. పట్టణంలోని తన ఇంటి వద్ద నుంచి బయలుదేరి గురువారం విధులకు హాజరైన వంశీకృష్ణ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు శుక్రవారం అదృశ్యం ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామారావు తెలిపారు. వంశీకృష్ణ తండ్రి కొలుసు శ్రీనివాసరావు కాటూరు పీహెచ్‌సీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



యనమలకుదురులో అలంకరణలో శ్రీపార్వతీదేవి అమ్మవారు



యనమలకుదురులో అమ్మవారి ఆలయంలో ప్రవేశించిన నాగుపాము



గన్నవరం లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరిస్తున్న భక్తులు

గన్నవరం: స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ సంప్రదాయం ప్రకారం అమ్మవారికి శ్రావణమాస తొలి పూజను బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన గౌడ, యాదవ, సగర, రజక, హరిజనుల ప్రతినిధులతో జరిపారు. ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మి)కి భక్తులు పాలపొంగళ్లను సమర్పించడంతో పాటు పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీసత్యసాయి సేవా సమితి, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన 108 మంది సువాసినీ స్త్రీలు పాల్గొని భక్తి శ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామికి ప్రత్యేక పూజలు, శ్రీలక్ష్మీ సహస్రనామ పూర్వక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, వివిధ వర్గాలకు చెందిన చిమట శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణుగోపాలరావు, అల్లాపురం శంకర్, పడమట సుబ్రమణ్యం, ఈడే సుబ్బారావు, జమలయ్య, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో...

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం నాగపంచమి, శ్రావణ శుక్రవారం పూజలను భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఉదయం శ్రీ పార్వతీ అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం భక్తి శ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన అత్యంత వైభవంగా చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి, అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు, ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు, ఆలయ ఈవో బి.గంగాధర రావు పాల్గొన్నారు.



పేరంటాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఆలయంలో ప్రవేశించిన నాగేంద్రుడు

నాగపంచమి నాడు శ్రీపార్వతీదేవి ఆలయంలో భక్తులు పూజలు చేస్తున్న సమయంలో నాగుపాము ఆలయంలో ప్రవేశించింది. భక్తులు శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు చేస్తుండగా నాగుపాము ఆలయంలో ప్రవేశించి కొంత సమయం ఉండి ఆ తరువాత వెళ్లింది. నాగుపాము ఆలయంలోకి రావటంతో భక్తులు భక్తితో ప్రత్యేక పూజలు చేశారు.

నున్నలో శ్రావణ శుక్రవారం పూజలు

నున్న(విజయవాడరూరల్) : క్రోధి నామ సంవత్సరం శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా నున్న గ్రామంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, కనకదుర్గ అమ్మ వారి దేవస్థానంలో మహిళలు లలితా సహస్ర నామ పారాయణం చేశారు. భక్తి ప్రవత్తులతో అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. చినకంచిలో శ్రీగరుడ పంచమి ప్రయుక్త శ్రీ గరుడ స్వామి ఉత్సవ సేవ దర్శనం జరిగింది. భక్తులు గరుత్మంతునికి విశేష అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. నాగపంచమి సందర్భంగా నాగేంద్ర స్వామికి పూజలు చేశారు.శ్రావణ శుక్రవారం శ్రీప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అష్టలక్ష్మీ పూజ జరిగింది.

పేరంటాలమ్మ ఆలయంలో...

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని అధిక సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు పలు గ్రామాల్లోని మహిళలు వేకువ జామునే ఆలయానికి చేరుకుని ముగ్గురమ్మలను దర్శించుకున్నారు. భక్తుల రద్దీను దృష్టిలో ఉంచుకుని ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శిలాఫలకం ధ్వంసం దుర్మార్గపు చర్య



నిడమానూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామవరప్పాడు: విజయవాడ నగరంలోని బీఆర్ అంబేద్కర్ స్మృతి వన శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్య అని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు నెహ్రూనగర్‌లోని మూడు బొమ్మల సెంటర్‌లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జాతి నాయకుల విగ్రహాల ధ్వంసాన్ని ఆపాలని, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు ఆపాలని, టీడీపీ అరాచక పాలన అంతమవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంబేద్కర్ భావజాలం, ఆశయాలకు అనుగుణంగా పరిపాలన చేస్తే ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు రాజ్యాంగానికి విరుద్ధంగా అరాచకపు పాలన చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని, విగ్రహాలు, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారన్నారు. అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని ప్రజాస్వామ్య వాదులంతా తీవ్రంగా ఖండించాలని పిలుపు నిచ్చారు. ఇకనైనా ఇటువంటి దాడులు ఆపకపోతే రాష్ట్ర ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణ రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, బొగ్గవరపు రాజేంద్రప్రసాద్, దూరు రత్నం, బత్తుల కోటేశ్వరరావు, సమ్మెట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా నేత వసంతరావు మృతి

పలు రాజకీయ పక్షాల నేతల నివాళులు



మాదు వసంతరావు(ఫైల్)

కంకిపాడు: వైఎస్సార్‌సీపీ జిల్లా నేత, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు(68) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కంకిపాడులోని తన నివాసంలో గుండెపోటుకు గురి కావటంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని పట్టణంలోని ఆయన నివాసానికి తరలించారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక నేతగా వ్యవహరిస్తున్న వసంతరావు సుదీర్ఘ కాలంగా వివిధ పార్టీల్లో అనేక కీలక పదవులను నిర్వర్తించారు. ఆయన మరణం వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. వసంతరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ మంత్రి జోగి రమేష్‌బాబు, కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి, జెడ్పీటీసీ బాకీ బాబు, వైఎస్సార్‌సీపీ నేత దేవినేని గౌతమ్, కంకిపాడు సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఎంపీటీసీలు కోనా కిషోర్, ధూళిపూడి కిషోర్, చిట్టూరి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు నత్తా వెంకటేశ్వరరావు, తంబాబత్తుల ఓంకారం, మేదంద్రావు కుటుంబరావు, కొండవీటి సుబ్బారావు, గుజ్జుల కోటేశ్వరరావు, టీడీపీ నేతలు బండి నాంచారయ్య, అన్నే ధనయ్య, కొణతం గిరిధర్ పలు రాజకీయ పక్షాలు, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల బాధ్యులు పలువురు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. వసంతరావు భౌతిక కాయానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నిబద్ధతతో పనిచేసే నాయకులకు సముచిత స్థానం



తెలంగాణ ప్రతినిధులను సత్కరిస్తున్న పంచాయతీ రాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు: నిబద్ధత, నైతిక విలువలతో కష్టపడి పనిచేసే నాయకులకు రాజకీయాల్లో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని పంచాయతీ రాజ్ చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరులోని ఆయన నివాసంలో రాజేంద్రప్రసాద్‌ను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పొల్యూషన్‌బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చాంబర్ ప్రతినిధులు భరత్, పుసులూరి నరేంద్ర శుక్రవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ చాంబర్‌లో క్రియాశీలకంగా పనిచేస్తూ పదవులు పొందిన నాయకులను వైవీబీ ఘనంగా సత్కరించారు. తెలంగాణలో పంచాయతీ రాజ్ చాంబర్ పటిష్టత, స్థానిక సంస్థల బలోపేతానికి చేయాల్సిన పోరాటాలపై చర్చించారు. వైవీబీ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో పంచాయతీ రాజ్ చాంబర్‌లో స్థానిక సంస్థల కోసం పోరాడిన ఎంతో మంది నాయకులు ప్రజాప్రతినిధులు లేదా నామినేటెడ్ పదవులను పొందారన్నారు. కార్యక్రమంలో నాయకులు జంపన వీర శ్రీనివాస్, రాజులపాటి ఫణి, చలపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడి హేయం

జెడ్పీటీసీ బాకీ బాబు

కంకిపాడు: విజయవాడ నడిబొడ్డున ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంపై దాడి పిరికిపందల చర్య అని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక న్యాయ మహాశిల్పంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించి తమ అహంభావాన్ని ప్రదర్శించారన్నారు. విగ్రహ ధ్వంసానికి కుట్రపన్నిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం శోచనీయమన్నారు. విద్రోహశక్తుల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

స్మృతివనం దాడి ఘటన నిందితులను శిక్షించాలి

జెడ్పీటీసీ ఎలిజిబెత్ రాణి

గన్నవరం: విజయవాడలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనంలో సామాజిక న్యాయ మహా శిల్పం బోర్డు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజిబెత్ రాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం స్మృతివనంలో విధ్వంసానికి పాల్పడడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనపై విజయవాడ నగర పోలీసులు వెంటనే స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులను పట్టుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించి రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంస, అరాచక పాలనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మోదీ విధానాలతో వ్యవసాయానికి నష్టం

గన్నవరం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతింటుందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రైతు విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో కౌలు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు తప్ప రైతుల సమస్యలు పట్టడం లేదన్నారు. దీనివల్ల వ్యవసాయ రంగానికి తీరని నష్టం జరుగుతుందన్నారు.

చెత్త సంపద కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి



పునాదిపాడులోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్

కంకిపాడు: చెత్త సంపద కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ సూచించారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, తదితర అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం రెండో రోజూ కొనసాగాయి. పునాదిపాడు గ్రామంలోని చెత్త సంపద కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చెత్త సేకరణ, నిర్వహణ, సంపద సృష్టి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణతో పంచాయతీల ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. గ్రామాభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ పీవీఎస్ మైథిలి, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కామినేని ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు

పెనమలూరు: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అధికారులు శుక్రవారం కానూరు కామినేని ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు జేఈవో డాక్టర్ అర్చన, కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ కామినేని ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలు ఎలా అందుతున్నాయని తనిఖీ చేశారు. వారు రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు అందించటానికి ఆస్పత్రి యాజమాన్యం డబ్బు అడుగుతున్నారా అని రోగులను వివరాలు అడిగారు. తనిఖీల్లో భాగంగా వైద్య సేవలు అందించిన డేటా పరిశీలించి క్యాథ్‌ల్యాబ్ సందర్శించారు. రికార్డులు తనిఖీ చేయగా అవకతవకలు జరిగనట్లు గుర్తించారు. ఒక పేషెంట్‌కు డబ్బులు కలెక్ట్ చేసి పెట్టి స్టంట్ వేయకుండా వదిలేశారు. ఒక రోగి వద్ద ఎన్టీఆర్ వైద్య సేవల్లో ఉచితంగా చేయాల్సిన వైద్య పరీక్షలకు గాను రూ.7 వేలు వసూలలు చేసినట్లు గుర్తించారు. వీటికి సంబంధించిన ఆధారాలు సేకరించి ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని ట్రస్టుకు నివేదించారు. ఆస్పత్రిలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండే విధంగా ఆరోగ్యమిత్ర టీమ్ లీడర్‌ను ఆదేశించారు.

రూ.50 లక్షలతో బీపీహెచ్‌యూకు శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రజల ఆరోగ్య సంరక్షణకు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బీపీహెచ్‌యూ)కు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదగా భూమిపూజ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా లక్ష జనాభా దాటిన పట్టణాలకు మాత్రమే బీపీహెచ్‌యూలను కేంద్రప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. కానీ హనుమాన్‌జంక్షన్‌లో ఈ యూనిట్ ఏర్పాటు ఆవశ్యకతను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లటంతో ఆయన చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరగా ఇక్కడ కూడా మంజూరు చేశారని యార్లగడ్డ వివరించారు. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌లో రక్త, మూత్ర, కళ్లె పరీక్షలతో పాటుగా ఇతర పరీక్షలు నిర్వహించేందుకు అధునాతన ల్యాబ్ ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. ఈ కేంద్రంలో కీటక శాస్త్రవేత్తతో పాటుగా ల్యాబ్‌కు సరిపడా సిబ్బందిని కూడా ప్రభుత్వం నియమించనున్నట్లు తెలిపారు. బీపీహెచ్‌యూలో ప్రజల ఆరోగ్య రికార్డులను కంప్యూటరీకరణ ద్వారా భద్రపర్చనున్నారని తెలిపారు. దీని ద్వారా రోగులు ఏ వైద్యశాలకు వెళ్లినా అక్కడి వైద్యులు ఆ రోగికి సంబంధించిన పూర్వ ఆరోగ్య చరిత్రను కంప్యూటర్ రికార్డుతో తెలుసుకునేందుకు అవకాశం ఉందని, తద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవటం, విద్యార్థుల్లో ఆరోగ్య సూత్రాలు, ఆరోగ్య సంరక్షణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించటంలోనూ ఈ కేంద్రం కృషి చేస్తుందని యార్లగడ్డ చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, స్థానిక ప్రముఖులు దయాల రాజేశ్వరరావు, అట్లూరి శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావర ప్రసాద్, వేగిరెడ్డి పాపారావు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: మండల పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిగడప సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా తాడిగడపలో పద్మజా నగర్, శ్రీనివాసానగర్ కాలువ కట్ట, ఎస్‌టీబీఎల్ కాలనీ, పెదపులిపాక గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మహదేవపురం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారు. ఈ కారణంగా మహదేవపురం కాలనీ, పంటకాలువ రోడ్డు, సనత్‌నగర్, కామయ్యతోపు, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు.

పెనమలూరు సెక్షన్‌లో...

గంగూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గంగూరు, పెనమలూరు, గోసాల, వణుకూరు, చోడవరం గ్రామాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారు.

కంకిపాడు మండలంలో...

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు, మద్దూరు, ప్రొద్దుటూరు, కోలవెన్ను విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదు.

విజయవాడ రూరల్ మండలంలో...

రామవరప్పాడు: ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. ప్రసాదంపాడులో శాస్త్రి బజారు, ఆశ్రమం రోడ్డు, ఏలూరు రోడ్డులో, ఎనికేపాడులో రైల్వేకట్ట, విజయ ఆగ్రోకట్ట, జెండా చెట్టు సెంటర్, 24 కె కల్యాణ మండపం వెనుక ప్రాంతం, కొడాలి వారి వీధి, ఎస్సీ కాలనీ, కేవీఆర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఉయ్యూరు మండలంలో...

ఉయ్యూరు: మండలంలోని నందమూరు 33 కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం కాటూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కాటూరు, రాజుపేట, కలవపాముల, కడవకొల్లు గ్రామాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ సరఫరా ఉండదని ఉయ్యూరు ఈఈ బి.కృష్ణ నాయక్ తెలిపారు. విద్యుత్, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దావాజిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో...

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని దావాజిగూడెం పరిధిలోని రాజీవ్ నగర్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం పామర్తి నగర్, రైస్‌మిల్ బజార్, రాజీవ్‌నగర్ కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీ, శ్రీమల్లికార్జున స్కూల్ రోడ్డులో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకువిద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంత వినియోగదారులు సహకరించవలసిందిగా గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

తగ్గిన వరదనీటి ఉధృతి

ఏడు అడుగులు వెనక్కి వెళ్లిన వరద



మద్దూరు వద్ద ఏటిపాయలో వలలను శుభ్రం చేస్తున్న మత్స్యకారుడు

కంకిపాడు: ఏటిపాయలో వరదనీటి ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు ఆగటంతో ప్రకాశం బ్యారేజీకి వచ్చే వరదనీరు తగ్గింది. దీంతో ఏటిపాయకు వరదనీటిని తగ్గించి విడుదల చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల పరిధిలో ఏటిపాయలో వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. అయితే ప్రకాశం బ్యారేజీ నుంచి వరదనీరు తగ్గటంతో ఏటిపాయలో నీటి మట్టం ఏడు అడుగులు వెనక్కి తగ్గింది. కరకట్ట నుంచి ఏటిపాయలోకి వెళ్లే రహదారి మార్గం అంచులు తాకుతూ వరదనీరు ప్రవహిస్తోంది. అయితే నీటి ప్రవాహం మాత్రం ఉధృతంగానే సాగుతోంది. ఆయా గ్రామాల పరిధిలోని మత్స్యకారులు ఏటిపాయకు చేరుకుని వలలు, పడవలను శుభ్రం చేసుకుంటున్నారు.

బయట పడని రహదారి మార్గం

ఏటిపాయలోని లంక భూములకు వెళ్లే రహదారి మార్గం వరదనీటిలోనే మునిగి ఉంది. దీంతో ఏటిపాయలోకి రాకపోకలు నిలిచిపోయాయి. ఏటిపాయలో ఉన్న లంక భూముల్లో మెట్ట పైర్లు సాగు చేస్తున్న రైతులు పంటల పరిస్థితి, నీరు, తెగుళ్ల యాజమాన్యంపై ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. భద్రతా చర్యల దృష్ట్యా ఏటిపాయలోకి రాకపోకలను అధికారులు నిలిపివేశారు. బందోబస్తు చర్యలను తహసీల్దార్ వి.భావన్నారాయణ పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

కేసరపల్లి(గన్నవరం) : విద్యార్థి దశ నుంచే పిల్లల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించాలని హెచ్‌సీఎల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ప్రాంతీయ ప్రతినిధి బి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లిలో శుక్రవారం హెచ్‌సీఎల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలకు స్వాగతం పలుకుతూ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాలను చేతపట్టుకుని భారత్ మాతాకి జై అంటూ నినాదాలతో ముందుకు సాగారు. పాఠశాల హెచ్‌ఎం నరేష్, స్పోర్ట్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ బి. సత్యనారాయణరావు, పీఈటీలు శ్రీదేవి, బ్రహ్మారెడ్డి, జనరంజనరాజు, గోపి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.